
ఉప్పరపల్లి జగనన్న కాలనీ జలమయం

# జలదిగ్బంధం.. అపార నష్టం

- ఉమ్మడి అనంత జిల్లాలో ముంపు కష్టం
- జనజీవనం అస్తవ్యస్తం
- నీట మునిగిన నగర శివారు కాలనీలు
- మూణ్నెళ్ల శ్రమ.. 3 గంటల్లో నేలమట్టం


అంబేడ్కర్‌కొట్టాల వద్ద కొట్టుకుపోతున్న ఆటో


ఉప్పరపల్లి కాలనీలో మునిగిన ఇళ్లు


పెనుకొండలో జాతీయ రహదారిపై చిక్కుకున్న బస్సును పొక్లెయిన్‌తో పక్కకు లాగుతున్న పోలీసులు


కళాకారుల కాలనీలో ఇళ్ల మధ్య నీటిని మళ్లిస్తూ


వరద పరిస్థితిపై అనంతపురం ఎస్పీ జగదీశ్‌తో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్


నగరశివారులో వరద బాధితులకు ఆహారం పంపిణీ

**ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, రాప్తాడు, పెనుకొండ, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి, ధర్మవరం:** ఉమ్మడి అనంత జిల్లాలో కుండపోత వర్షానికి అన్ని మండలాల్లో చెరువులు పొంగిపొర్లాయి. మరువలు పారడంతో వంకలు పోటెత్తాయి. భారీ వర్షానికి సుమారు 18 మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో వరద ప్రవాహానికి రోడ్లు కోతకు గురయ్యాయి. కల్వర్టులు, వంతెనలపైకి భారీ ప్రవాహం కొనసాగడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి.

● రాప్తాడు మండలం బండమీదపల్లి, కనగానపల్లిలోని పలు చెరువులు ఉప్పొంగడంతో ఆ నీరంతా పండమేరులోకి చేరింది. మంగళవారం తెల్లవారుజామున కనగానపల్లి చెరువు కట్ట తెగి వరద పండమేరును ముంచెత్తింది. వంకకు రెండువైపులా కాలనీల్లోకి నీరు చేరింది. ఉప్పరపల్లి జగనన్న కాలనీలో ఇళ్లు సగం వరకు మునిగిపోయాయి. అకస్మాత్తుగా కాలనీల్లోకి వరద నీరు వచ్చి చేరింది. అంతా నిద్రలో నుంచి తేరుకునేలోపు ఇళ్లలోకి వరద ముంచెత్తింది. ప్రజలు మిద్దెల పైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. అనంతపురం గ్రామీణం పరిధి కళాకారుల కాలనీ, ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ, ఇందిరమ్మ కాలనీ, నగర పరిధిలోని రామకృష్ణ కాలనీ ముంపులోకి వెళ్లిపోయాయి. రెవెన్యూ, పోలీసు అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, తెదేపా ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల సునీత ముంపు కాలనీల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.

### ఆక్రమణలే శాపంగా మారి..

కనగానపల్లి మండలంలో అత్యధికంగా 19 సెం.మీ. వర్షపాతం కురిసింది. పండమేరుకు ఇరువైపులా ఉన్న కాలనీలను వరద ముంచెత్తడానికి ఆక్రమణలు కూడా ఒక కారణమని చెబుతున్నారు. కొందరు వంకను పూడ్చి ఇళ్లు, ప్రార్థన మందిరాలు నిర్మించారు. కంపచెట్లు ఏపుగా పెరిగాయి. ప్రవాహం వేగంగా వెళ్లే వీలులేక ఎగువన ఉన్న కాలనీలు మునుగుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీటీ స్టేడియం ఎదురుగా వంతెన నుంచి పండమేరులో ఆక్రమణలు అధికంగా కనిపిస్తున్నాయి. వంకకు ఇరువైపులా ఆక్రమించి ఇటుక బట్టీలు, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టడంతో ప్రవాహం దిశ మారిపోయింది. ఉప్పరపల్లి వైపు వెళ్తున్న కొద్దీ ఆక్రమణలతో వంక కుంచించుకుపోయింది. ఏదేళ్లలో స్థానిక వైకాపా నాయకులు వంకను ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయించేశారు. ఇంకొంతమంది వంక పోరంబోకుకు నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించుకున్నారు. ఫలితంగా వంక ప్రవాహాలు ముందుకు సాగక కాలనీలను ముంచేస్తున్నాయి.

### జాతీయ రహదారిపై వరద..

కనగానపల్లి మండలవ్యాప్తంగా ఉన్న 13 చెరువులలోకి నిండుగా నీరు చేరాయి. వేరుసెనగ, వరి పొలాల్లో వర్షం నీరు ప్రవహించింది. ముక్తాపురం చెరువు మరువ పారి 44వ జాతీయ రహదారికి పక్కన పెట్రోలు బంకులోకి మూడు అడుగుల వరకు నీరు చేరింది. ముక్తాపురం వద్ద నీటి ప్రవాహానికి జాతీయ రహదారి వెంబడి బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న మూడు బస్సుల్లోకి నీరు చేరడంతో ఐదు గంటలపాటు అక్కడే నిలిచిపోయాయి.

● మండల కేంద్రానికి సమీపంలో ఉన్న చెరువు కట్ట తెగి ఆయకట్టు కింద సాగు చేసిన 90 ఎకరాల వరి పంట నీట మునిగింది. చెరువులో నీరు మొత్తం కనగానపల్లి వంక మీదుగా రాప్తాడులోని పండమేరు వంక వెంబడి ప్రవహించాయి. చెరువు ఆయకట్టుకు ఆనుకొని ఉన్న సురేశ్‌బాబుకు చెందిన ఆరు ఎకరాల్లో వరి దెబ్బతిని రూ.4 లక్షల నష్టం వాటిల్లింది.

● సీకేపల్లి మండలం అమిదాలకుంట వద్ద ధర్మవరం-కొత్తచెరువు రహదారిపై వాహన రాకపోకలు నిలిచాయి. సీకేపల్లి, వెంకటాంపల్లి, ప్యాదిండి, న్యామద్దల తదితర గ్రామాల ప్రధాన రహదారులపై రాకపోకలు నిలిచాయి..

### కనగానపల్లిలో కుండపోత

గతంలో ఎన్నడూ లేనంతగా కనగానపల్లి మండలంలో 19 సెం.మీ. వర్షపాతం నమోదైంది. రామగిరిలో 9.8, చెన్నేకొత్తపల్లి 9.5, పెనుకొండ 8.9, కొత్తచెరువు 8.8, హిందూపురం 8.3 సెం.మీ.ల వర్షం కురిసింది. కళ్యాణదుర్గంలో 8.9, కంబదూరులో 6.5, ఆత్మకూరులో 6 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

### 'లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్త'

**పుట్టపర్తి, పుట్టపర్తి పట్టణం:** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, వంకల కింద ఉన్న లోతట్టు ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్నా కోరారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.


జగనన్న కాలనీలో మోకాల్లోతు నీటిలో బయటకు వస్తున్న బాధితులు

### తేరుకునేలోపు ముంపులోకి



ఉప్పరపల్లి జగనన్న కాలనీలో నివాసముంటున్నాం. మంగళవారం తెల్లవారుజామున నిద్ర నుంచి తేరుకునేలోపు ఇళ్లలోకి వరద వచ్చేసింది. చూస్తూ ఉండగానే కాలనీ మొత్తం మునిగిపోయింది. సామగ్రి కాపాడుకునే సమయం దొరకలేదు. కరెంటు సరఫరా నిలిచి ఎటూ పోలేని పరిస్థితి. పిల్లలు, వృద్ధులతో ఇబ్బందులు పడుతూనే సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాం. సాయంత్రానికి వరద తగ్గింది.

**- రాజకుళ్లాయమ్మ, ఉప్పరపల్లి**

### 15 గంటలు వణికిపోయాం



పండమేరువాగు ఉప్పొంగడంతో వాగుకి ఆనుకుని జగనన్న కాలనీ మొత్తం ముంపునకు గురైంది. అర్ధరాత్రి ఆకస్మాత్తుగా ఇళ్లలోకి నీరు చేరి కట్టుబట్టలతో బయటకు రావాల్సి వచ్చింది. సాయంత్రం వరకు 15 గంటలు ఎటూ కదల్లేక ఉండిపోయాం. ప్రభుత్వం స్పందించి భవిష్యత్తులో ఇలాంటి ముంపు రాకుండా కరకట్ట ఏర్పాటు చేయాలి. **- బాను, ఉప్పరపల్లి**


కనగానపల్లిలో తెగిన చెరువు కట్ట.. ఈ నీటితోనే అనంతపురం శివారు కాలనీలు మునిగాయి


కనగానపల్లిలో మండలంలో నేలవాలిన వరి పంట

### మీ కష్టం చూస్తే కన్నీరొస్తోంది..

భారీ వర్షంతో నష్టపోయిన రైతులను చూస్తే కన్నీరు వస్తోంది. రైతులు ధైర్యం కోల్పోవద్దు ఆదుకుంటాం. రామగిరి మండలంలో వరద ధాటికి పంట నష్టపోయిన వివరాలను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లాం. చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తెగిపోయిన చెరువులను వెంటనే మరమ్మతులు చేయించాలని జలవనరుల శాఖ మంత్రి రామానాయుడుని కోరాం.

**- ఎమ్మెల్యే పరిటాల సునీత**




వనమిత్ర పార్కులో తలదాచుకున్న అంబేడ్కర్ కొట్టాలవాసులు

### ఉద్యోగులు, కార్మికులకు ఇబ్బంది

పెనుకొండ మండలం మునిమడుగు రెవెన్యూ పొలంలోగల కియా అనుబంధ పరిశ్రమలకు వెళ్లే రహదారి కోతకు గురైంది. అనంత టెక్, స్విఫ్ట్ సపోర్ట్ సర్వీసు, హ్యూండాయ్ గ్లోవిస్ సీకేడీ, వేర్‌హౌస్‌లకు వెళ్లే రహదారి కోతకు గురవడంతో 2 వేల మందికి పైగా కార్మికులు అవస్థలు పడ్డారు. అనుబంధ పరిశ్రమలకు ఉద్యోగులను తరలించే బస్సుల్ని గుట్టూరు శివారులోని ఈద్గా వద్ద నిలిపివేశారు. ఉద్యోగులు, కార్మికులు రహదారిపై ప్రమాదకరంగా నడుచుకుంటూ వెళ్లారు. ఇదే మండలంలోని వెంకటగిరిపాళ్యం చెరువు నిండిమరవ పారడంతో గుట్టూరు శివారులో 44వ జాతీయ రహదారిపై వరద పారింది. 8 గంటల పాటు రాకపోకలు ఒకే రోడ్డుపై కొనసాగాయి. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఓ ట్రావెల్‌బస్సు, లారీ, కారు వరద నీటిలో చిక్కుకున్నాయి. కియా ఇండస్ట్రియల్ ఏరియా స్టేషన్ ఎస్సై రాజేశ్ సిబ్బందితో కలిసి రోడ్డు పై వాహనాదారులను అప్రమత్తం చేశారు.

### వరుస విషాదాలు.. కుటుంబం కుదేలు

రాప్తాడు మండలం బండమీదపల్లికి చెందిన పూజారి కుటుంబంలో ఒకే సంవత్సరంలో వరుస విషాదాలు చోట చేసుకున్నాయి. బండమీదపల్లి గ్రామం సల్లాపురమ్మ గుడి పూజారి మాధవయ్యకు భార్య లావణ్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మాధవయ్య తన పెద్ద కుమారుడు సల్లప్ప పాముకాటుకు గురై తొమ్మిది నెలల క్రితం చనిపోయాడు. సల్లాపురమ్మ గుడి పూజారిగా ఉన్న మాధవయ్య ఐదు రోజుల క్రితం అకస్మాత్తుగా మరణించడంతో కుటుంబం ఇంటి పెద్దను కోల్పోయింది. భార్య లావణ్య కుమారుడు, భర్త కోల్పోయి బాధను దిగమింగుకొని 80 మేకలను మేపుకొంటూ పిల్లలను చదివించి పెద్ద చేయాలి అనుకుంది. ఈలోపు ప్రకృతి వారిపై పగపట్టింది. బండమీదపల్లి చెరువుకు ఆనుకొని ఉన్న సల్లాపురమ్మ గుడివద్ద సోమవారం రాత్రి మేకలను తోలారు. సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షాలకు చెరువు నిండి గుడి వైపు ప్రాంతం నీట మునిగి మేకలు ఊపిరాడక చనిపోయాయి. మాకే ఎందుకు ఈ కష్టాలు దేవుడా అని బోరున విలపించడం స్థానికులను కంటతడి పెట్టించింది. ధర్మవరపు మురళి, గ్రామస్థులు అందరూ కలసి వారికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించారు.


నీటిలో మునిగి ఊపిరి ఆడక చనిపోయిన మేకలు

### పంటలు, ఇళ్లు ధ్వంసం..

● అనంత జిల్లాలో 10, శ్రీసత్యసాయి జిల్లాలో 8 మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో సాధారణ పంటలు 1,146 హెక్టార్లు, ఉద్యాన పంటలు 46 హెక్టార్లు, అనంత జిల్లాలో సాధారణ పంటలు 62 హెక్టార్లు, ఉద్యాన పంటలు 43 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు అధికారిక చెబుతున్నాయి. రెండు జిల్లాల్లో కలిపి రూ.5 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. 50కి పైగా జీవాలు మరణించాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 52 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 23 వరకు రహదారులు దెబ్బతిన్నాయి. చెరువులు ఉప్పొంగడంతో ఆయకట్టు కింద సాగుచేసిన వందలాది ఎకరాల్లో వరి నీట మునిగింది. కల్లాల్లో ఆర బెట్టిన వేరుసెనగ కొట్టుకుపోయింది.

# పుట్టపర్తి.. ఏదీ ప్రగతి!

- ఎక్కడి సమస్యలు అక్కడే..
- ఐదేళ్లలో పట్టించుకోని వైకాపా ప్రభుత్వం
- వచ్చేనెల 18 నుంచి సత్యసాయి జయంతి వేడుకలు


ప్రశాంతి నిలయం చేరుకునే ప్రధాన రహదారి దుస్థితి

రోజూ సందర్శించే భక్తులు: **5 వేల నుంచి 10 వేలు**
సత్యసాయి జయంతి వేడుకలకు వచ్చేవారు (అంచనా): **లక్ష మంది**
పురపాలిక పరిధిలో జనాభా: **40 వేలు**

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** పుట్టపర్తి.. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం. అంతకుమించి ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక క్షేత్రం. దేశవిదేశాల నుంచి ఆయా రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు వేలాదిగా భక్తులు వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న పట్టణాన్ని గత వైకాపా ప్రభుత్వం ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. అప్పటి పాలకుల నిర్లక్ష్య ఫలితంగా అడుగడుగునా సమస్యలు తిష్ఠ వేశాయి. గుంతలను తలపించే రహదారులు, వెలగని దీపాలు, వీధుల్లో పొంగిపోర్లుతున్న మురుగు దర్శనం ఇస్తున్నాయి. సత్యసాయి 99వ జయంతి వేడుకలు నవంబరు 18 నుంచి 23 వరకు జరగనున్నాయి. గతంలో పాలకులు, అధికారులు సత్యసాయి జయంతి వేడుకల ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహించడం తప్ప.. క్షేత్రస్థాయిలో పనుల నిర్వహణకు ప్రత్యేక చొరవ చూపలేదు. శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులపై దృష్టి సారించిన పాపనపోలేదు. ఈ నేపథ్యంలో తెదేపా కూటమి ప్రభుత్వం కనీస సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ఎక్కడ.. ఎలాగంటే..?

★ ప్రశాంతి నిలయం పడమర ద్వారం నుంచి పెట్రోల్ బంకు, చిత్రావతి బైపాస్, బ్రాహ్మణపల్లి, బీడుపల్లి, సాయినగర్ రహదారులు అధ్వానంగా మారాయి.

★ వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. హనుమాన్ కూడలి, గణేష్ కూడలి, కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జి, చింతతోపు, పెట్రోలుబంకు సమీపాన అంధకారంగా ఉంటుంది. మరోవైపు వేళాపాళాలేకుండా విద్యుత్తు కోతలు విధిస్తున్నారు.

★ భూగర్భ మురుగుపారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పలుచోట్ల మురుగు పొంగిపొర్లుతోంది. దుర్వాసన భరించలేక భక్తులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. చిత్రావతిరోడ్డు, ఎస్బీఐ, వివేకానందనగర్, గోవిందపేట, సాయినగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది.

### తగిన ఏర్పాట్లు చేస్తాం - ప్రహ్లాద, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

సత్యసాయి జయంతి వేడుకల నిర్వహణ, రహదారుల మరమ్మతులతోపాటు ఇతర పనులకు నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. భక్తులు, పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా కనీస సదుపాయాలు కల్పిస్తాం. పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నాం. వీధిదీపాలు, పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తాం.


ఎస్‌బీఐ మార్గంలో మురుగు తీరు

# రూ.19.99 లక్షల ఉపాధి నిధుల దుర్వినియోగం

### సామాజిక తనిఖీలో అక్రమాలు బహిర్గతం

**కొత్తచెరువు, న్యూస్‌టుడే:** కొత్తచెరువు మండలంలో ఏడాదిలో జరిగిన ఉపాధి పనుల్లో రూ. 19.99 లక్షలు దుర్వినియోగం జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు లెక్కలు తేల్చాయి. వైకాపా హయాంలో ఉపాధి సిబ్బంది ఇష్టారాజ్యంగా నిధులను దుర్వినియోగం చేసినట్లు బహిర్గతమైంది. డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఏపీడీ జ్యోతి, జిల్లా విజిలెన్సు అధికారులు రాజ్‌కుమార్, నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో నటరాజ్, ఏపీవో నాగిరెడ్డి, ఏఈ నాగరాజులు మంగళవారం ప్రజా వేదికను 3గంటలకు ప్రారంభించి రాత్రి వరకూ కొనసాగించారు. ఏడాదిలో 15 పంచాయతీల్లో 1,440 పనులు చేయడానికి రూ.3.99 కోట్లు వెచ్చించారు. ప్రధానంగా మస్టర్లలో సంతకాలు లేవు. కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నాయి. రైతుల పొలాల్లో మొక్కలు లేవు. అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటకనే బిల్లులు చేశారు. కొన్ని వర్క్ ఐడీలు లేకనే రూ.లక్షల బిల్లులు డ్రాచేశారు. కొన్ని పాత ఇళ్లకు బిల్లులు మంజూరు చేసి స్వాహాకు పాల్పడగా.. మరికొన్నింటికి పునాది బిల్లులు మంజూరు చేయాల్సి ఉండగా గోడలు, పైకప్పు బిల్లులు అడ్డగోలుగా చేసినట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. మొత్తం రూ. 19.99 లక్షల ఉపాధి నిధులను దుర్వినియోగం చేసినట్లు ప్రజా వేదికలో ఎస్సార్పీలు అవులయ్య, తిరుమలేసులు డీఆర్పీల బృందంతో ప్రజా వేదికలో అధికారులకు నివేదించి చర్చించారు.

# తుపాకీ కాల్పులు జరిపిందెవరు?

### కేసు విచారణకు రెండు పోలీసు బృందాలు

**ధర్మవరం, న్యూస్‌టుడే:** శ్రీసత్యసాయి జిల్లా, బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన తుపాకీ కాల్పుల ఘటనపై విచారణకు ప్రత్యేక పోలీసు బృందం హైదరాబాద్‌కు వెళ్లింది. పట్టపగలు జాతీయ రహదారిపై బస్టాప్ వద్ద కాల్పుల ఘటన జరగడాన్ని పోలీసు యంత్రాంగం తీవ్రంగా పరిగణించింది. అన్నమయ్య జిల్లా వీరపల్లి మండలం షికారీపాలెంకు చెందిన ముఠా సభ్యుడు కొమరి బంగారీ అనే యువకుడు బత్తలపల్లి పోలీసులకు పట్టుబడ్డాడు. కాల్పులు జరిపింది హైదరాబాద్‌కు చెందిన వారు అని విచారణలో బంగారీ తెలపడంతో పోలీసులకు కీలక సమాచారం దొరికింది. గుప్తనిధులు దొరికాయని, తక్కువ ధరకే బంగారు నాణేలు, ఇతర ఆభరణాలు ఇస్తామని షికారీపాలెం ముఠా ఎరవేసి డబ్బు తీసుకొని మోసగిస్తున్నట్లు గుర్తించారు. కొమరి బంగారీతోపాటు రాణా రోర్, ఇలాచ్, రాణా హరీష్ ఇలా.. తెలంగాణలో పలువురిని బంగారం పేరుతో మోసగించినట్లు తేలింది. షికారీపాలెం ముఠాపై తుపాకీ కాల్పులు జరిపిన వ్యక్తులు హైదరాబాద్‌కు చెందినవారుగా సమాచారం లభించింది. వారు మరో ముఠాకు చెందినవారుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో ఒక హైదరాబద్‌కు చెందిన ఒక యూట్యూబర్ ఉన్నట్లు తెలిసింది. కేసు దర్యాప్తునకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు రెండు పోలీసు బృందాలు వెళ్లాయి. కాల్పులు జరిపి పరారైనవారు సైబర్ క్రైమ్ పోలీసులమని చెప్పి పోలీసులను పక్కదారి పట్టించారు. ఘటన జరిగి మూడ్రోజులు గడిచినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. మరోవైపు షికారీపాలెం ముఠాకు చెందినవారూ పరారీలో ఉండటంతో పోలీసులు గాలిస్తున్నారు.

జాతీయ రహదారి..

# భద్రత కొరవడి

## పని చేయని నిఘా నేత్రాలు, వెలగని దీపాలు



అంబేడ్కర్ కాలనీ సమీపంలో జాతీయరహదారిపై పని చేయని నిఘానేత్రాలు, అంధకారం

**పామిడి, న్యూస్‌టుడే :** పామిడిలోని పలు ప్రధాన ప్రాంతాల్లో, జాతీయ రహదారిలో నిఘానేత్రాలు ఏర్పాటు చేసినా.. నిర్వహణ లేక అవి పని చేయడం లేదు. నేరాలను నియంత్రించే దిశగా తొమ్మిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. నేరాల అదుపులో కీలకంగా మారిన సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజాప్రతినిధులు, దాతలు, వ్యాపారుల సహకారంతో వీటిని ఏర్పాటు చేశారు. మొదట్లో బాగానే పనిచేసినా నిర్వహణ, మరమ్మతులు సమస్యగా మారాయి.

### రాత్రిళ్లు కన్నుగప్పి.. అక్రమాలు

పెన్నానది నుంచి ఇసుకను తరలించాలంటే రాత్రిళ్లు జాతీయ రహదారి గుండా వెళ్లాల్సిందే. దీంతో అక్రమార్కులు 44వ జాతీయరహదారి ప్రధాన కూడళ్లల్లోని నిఘా నేత్రాలు, వాటి పక్కన అమర్చిన విద్యుద్దీపాలు వెలగకుండా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే అదునుగా ఇప్పటి వరకు అక్రమార్కులు అర్ధరాత్రి సమయాల్లో గుట్టు చప్పుడు కాకుండా అంబేడ్కర్‌కాలనీ సమీపంలోని జాతీయ రహదారి కూడలి, వై-జంక్షన్ కూడలి, ఎద్దులపల్లి రోడ్డు కూడళ్లలో ఇసుక అక్రమ రవాణాతో పాటు గ్రావెల్, రేషన్ బియ్యం దందా కొనసాగుతోంది. ఇంత తతంగం నడుస్తున్నా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. నేర నియంత్రణలో భాగంగా 100 మంది పోలీసులతో సమానంగా నిఘానేత్రాలు పనిచేస్తాయని చెబుతున్న పోలీసు అధికారులు తక్షణమే సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యతను చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువలకు గండ్లు



హెచ్చెల్సీ గట్టుకు పడిన రంధ్రం

**కణేకల్లు, న్యూస్‌టుడే :** తుంగభద్ర హెచ్చెల్సీ 159.277 కి.మీ. ఎన్.హనుమాపురం యూటీ వద్ద మంగళవారం సాయంత్రం హెచ్చెల్సీ గట్టు మట్టి కుంగి రంధ్రం పడింది. కొద్దిగా నీరు లీకేజీ అవుతుండటం గమనించిన తెదేపా ఎంపీటీసీ సభ్యుడు నరేంద్రబాబు వెంటనే హెచ్చెల్సీ అధికారులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. జేఈ నరేంద్రమారుతి ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన పొక్లెయిన్‌తో రంధ్రం పూడ్చివేత పనులు చేపట్టారు. గట్టును పటిష్ఠం చేసి నీరు వృథా కాకుండా అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది హెచ్చెల్సీకి నీరు విడుదల కాక మునుపే ఇదే ప్రదేశంలో యూటీ గట్టు కుంగి పడిన రంధ్రాన్ని, యూటీ అడుగుభాగాన కాంక్రీట్ దెబ్బతిని పైకప్పునకు పడిన రంధ్రాన్ని పూడ్చి వేసి మరమ్మతులు చేయించారు. శిథిలావస్థకు చేరిన యూటీ వద్ద తిరిగి అదే ప్రదేశంలో మట్టి గట్టుకు రంధ్రం ఏర్పడటం గమనార్హం. ఇటీవల తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రంధ్రం పడటంపై గట్టు పటిష్ఠతపై భయాందోళన వ్యక్తమవుతోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



పొక్లెయిన్‌తో రంధ్రం పూడ్చివేత పనులు చేయిస్తున్న అధికారులు

**సోమందేపల్లి:** భారీ వర్షాలకు మండలంలోని మంచేపల్లి గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువకు గండి పడింది. సోమవారం రాత్రంతా కురిసిన భారీ వర్షాలకు భారీగా చేరిన నీటి ప్రవాహానికి మంగళవారం హంద్రీనీవా కాలువ మట్టి కోతకు గురై తెగిపోయింది. దీంతో కాలువలోని నీరంతా మంచేపల్లి చెరువుకు చేరడంతో అది పూర్తిగా నిండిపోయి మరువ పారింది.

### వెంటనే మరమ్మతులు చేపట్టండి : మంత్రి

హంద్రీనీవా కాలువకు పడిన గండిని వెంటనే పూడ్చి, మరమ్మతులు చేయించాలని మంత్రి ఎస్.సవిత ఆదేశాలు జారీ చేశారు.



మంచేపల్లి సమీపంలో...

మంగళవారం సాయంత్రం ఆమె అమరావతి నుంచి చరవాణిలో హంద్రీనీవా సుజల స్రవంతి, జల వనరుల శాఖల ఇంజినీరింగ్ అధికారులతో మండలంలో నెలకొన్న పరిస్థితుల గురించి తెలుసుకొన్నారు. ఆనందపురంలో చెరువు నీటితో నిండిపోయి మరువ పారడంతో రైతుల వరి పంట పొలాలు నీట మునిగిన విషయాన్ని తెలుసుకొని, పంటలకు ప్రమాదం లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని, నివేదిక తయారు చేయించాలన్నారు.

## గుంతకల్లు - కదిరిదేవరపల్లి మధ్య రైలు రద్దు

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** కదిరిదేవరపల్లి నుంచి రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం మీదుగా తిరుపతికి రోజూ రాకపోకలు సాగించే ప్యాసింజరు రైలును అధికారులు నవంబరు 1 నుంచి గుంతకల్లు-కదిరిదేవరపల్లి మధ్య రద్దు చేస్తున్నట్లు డివిజన్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం-కదిరి దేవరపల్లి మధ్య స్టేషన్లలో యార్డుల ఆధునికీకరణ పనులు, రైల్వే సిగ్నలింగ్ పనులు చేపడుతుండంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. తిరుపతి నుంచి కదిరిదేవరపల్లికి వెళ్లే రైలు గుంతకల్లు-కదిరిదేవరపల్లి మధ్య నవంబరు 1 నుంచి 30 తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే కదిరిదేవరపల్లి నుంచి వెళ్లే రైలు నవంబరు 2 నుంచి డిసెంబరు 1వరకు రద్దు చేశారు. ఈ రైలు గుంతకల్లు-తిరుపతి మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తుందని వివరించారు.

# సత్యసాయి స్ఫూర్తి.. ప్రభుత్వ బడులకు దీప్తి

## వందలాది పాఠశాలలకు భక్తురాలి చేయూత



సుందరవల్లి దంపతులు

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** నిజమైన దేవుడు మందిరాల్లో కాదు.. ప్రజల హృదయాల్లో కొలువున్నారని సత్య సాయి బోధనలు ఆమెను కదిలించాయి. మానవసేవయే.. మాధవసేవ అనే భగవంతుడికి నిజమైన ఆరాధన అన్న సాయి సూక్తులు సేవవైపు నడిపించాయి. సత్య సాయి స్ఫూర్తితో సమాజానికి ఎంతో కొంత చేయాలనే గొప్ప మనసుతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.. విజయవాడకు చెందిన విశ్రాంత అచార్యులు సుందరవల్లిసురేష్. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు సమకూరుస్తున్నారు.

### సేవల్లో కొన్ని..

- పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రెండు అదనపు గదులు, కమ్యూనిటీ భవనం, భోజన సౌకర్యార్థం షెడ్డు నిర్మించారు. 75 మంది విద్యార్థులకు సైకిళ్లు అందించారు. రూ.30 లక్షల వరకు వ్యయం చేశారు.
- పుట్టపర్తి ప్రభుత్వ పాఠశాలలో నీటి శుద్ధి ప్లాంటు, 500 మంది విద్యార్థులకు అనుగుణంగా బల్లలు, మరుగుదొడ్లు నిర్మించారు. దాదాపు రూ.12 లక్షలతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.
- జిల్లాలోని 22 ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం 8.30 గంటలకు వందలాది మంది విద్యార్థులకు రోజూ అల్పాహారం సౌకర్యం కల్పిస్తున్నారు.



ఉదయం అల్పాహారం తీసుకుంటున్న బీడుపల్లి పాఠశాల విద్యార్థులు

### కోట్ల రూపాయల వ్యయంతో..

ప్రభుత్వ బడుల్లో అభ్యసించే విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. 2004లో సిద్దార్థ కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తున్న సుదరవల్లి సత్యసాయి పిలుపుతో పుట్టపర్తికి వచ్చేశారు. 2005 నుంచి శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మానవతా విలువలతో కూడిన విద్యా బోధన అందించారు. తలంలి అక్కడి వెళ్లగా ప్రభుత్వ పాఠశాలల కష్టాలు చూసి చలించిపోయారు. పాఠశాలల్లో అదనపు గదులు, సామాజిక భవనాలు, కంప్యూటర్లు, బల్లలు, నీటి శుద్ధిప్లాంట్లు, ఉదయం 8.30 గంటలకు అల్పాహారం సదుపాయం కల్పించారు. వీటితో పాటు గ్రామీణ ప్రాంతాల రహదారుల మరమ్మతులు, నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు, గ్రైండర్లు, తోపుడుబండ్లు, నిత్యావసర వస్తువుల పంపిణీ చేస్తున్నారు. ఇవన్నీ ఖ్యాతి కోసం చేస్తున్న సేవలు కాదు.. ప్రచార ఆర్భాటం మచ్చుకైనా కనిపించదు.

### ఊపిరి ఉన్నంత వరకూ చేస్తా..

మానవ సేవయే.. మాధవసేవ అన్న సత్యసాయి స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నా. స్వచ్ఛంద పదవీ విరమణ చేసి పుట్టపర్తి వచ్చేశా. అప్పటి నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు విలువల విద్యాబోధనతో పాటు స్నేహితుల సహకారంతో మౌలిక సదుపాయాలు కల్పించాం. ఊపిరి ఉన్నంత వరకు సమాజానికి సేవ చేస్తా. **- సుందరవల్లిసురేష్, భక్తురాలు**

# అనంతలో నాగార్జున సందడి



అభిమానులకు అభివాదం చేస్తున్న అక్కినేని నాగార్జున

**అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే:** సినీ నటుడు అక్కినేని నాగార్జున అనంతలో సందడి చేశారు. మంగళవారం నగరంలోని సూర్యనగర్ రోడ్డు సమీపంలో కల్యాణ్ జ్యువెలర్స్ షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనంత అభిమానుల ప్రేమ మరువలేనిదన్నారు. ఆయన చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేశ్ కల్యాణ్‌రామన్, సిబ్బంది పాల్గొన్నారు.

## చాగల్లు జలాశయం నుంచి నీరు విడుదల

**పెద్దపప్పూరు, న్యూస్‌టుడే :** మండలంలోని చాగల్లు జలాశయం నుంచి 200 క్యూసెక్కుల నీటిని అధికారులు మంగళవారం పెన్నానదికి విడుదల చేశారు. పై ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో రూ.150 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతున్నట్లు హెచ్చెల్సీ ఏఈ హరినాథ్ తెలిపారు. జలాశయంలోకి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉండడంతో ముందుజాగ్రత్తగా నీటిని నదికి విడుదల చేసినట్లు ఏఈ చెప్పారు. నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## ఆలయంలోకి వరద ఆపేలా చర్యలు



వరద సమస్యపై ఆరాతీస్తున్న ఆర్డీవో, ఈవో, ఇతర అధికారులు

ఈనాడు కథనానికి స్పందన

**కదిరి, న్యూస్‌టుడే:** భారీ వర్షాలకు ఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోకి వరద పారకుండా ఆపేందుకు అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. 'ఖాద్రీశా.. వరద ముప్పు తప్పేనా?' శీర్షికన 'ఈనాడు'లో శనివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు అధికారులు స్పందించారు. వరద ప్రవాహం ఆలయ మీదుగా రాకుండా ఆపేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలన్నదానిపై చర్చించారు. ఇందులో భాగంగా ఆర్డీఓ వెంకట సన్యాసిశర్మ, ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప, మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ వీధిగుండా వచ్చే వరద నీటిని ధ్వజస్తంభం ముందునుంచే మళ్లించేలా కాలువ నిర్మాణం చేపట్టాలని చర్చించారు. మురుగు, వరద నీరు సులభంగా ఆలయం వైపు రాకుండా సజావుగా వెళ్లేలా కాలువ వెడల్పును పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆలయ తిరుమాడవీధుల్లో డ్రైనేజీల్లో పూడికను సత్వరం తొలగించేలా పనులు చేపట్టాలని ఆర్డీఓ మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.

## ఐటీఐలో ప్రవేశాలు

**జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే:** ప్రభుత్వ బాలికల ఐటీఐలో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నందకుమార్ తెలిపారు. బాలికలకు ప్రత్యేకంగా దుస్తుల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న ధ్రువపత్రాల పరిశీలన, 28న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు.

# ఉపాధి పనుల్లో రూ.78 లక్షలు దుర్వినియోగం



సామాజిక తనిఖీ బహిరంగ వేదికలో వివరాలను వెల్లడిస్తున్న విజిలెన్స్ అధికారి రమణారెడ్డి

**ఉరవకొండ, న్యూస్‌టుడే :** ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉపాధి హామీ పథకం బహిరంగ వేదిక డ్వామా పీడీ సలీంబాషా, విజిలెన్స్ అధికారి రమణా రెడ్డి, ఎంపీడీఓ రవిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రూ.9.15 కోట్ల విలువైన పనులు జరగ్గా.. మొత్తం రూ.78,66,935 దుర్వినియోగమైనట్లు సామాజిక తనిఖీ బృందం తమ పరిశీలనలో గుర్తించి బహిరంగ వేదికకు నివేదించింది. అయితే అధికారులు రూ.9.29 లక్షలు మాత్రమే రికవరీకి ఆదేశించారు. రూ.7.26 లక్షలకు సంబంధించి పరిశీలన చేయాలని సూచించారు. మండల ఉపాధి అధికారులు, సిబ్బందికి రూ.1.73 లక్షల అపరాధరుసుము విధించారు. మరో రూ.62.11 లక్షల విలువైన పనులకు సంబంధించిన ఫొటోలు, ఇతర వివరాలను ఉపాధి సిబ్బంది చూపడంతో ఆ మొత్తాన్ని అధికారులు మినహాయించారు. అయితే ఈ బహిరంగ వేదికకు వైకాపా హయాంలో పని చేసిన క్షేత్ర సహాయకులు హాజరు కాలేదు. వారు అక్రమాలకు పాల్పడి ఉండడంతోనే ఎవరూ అక్కడికి రాలేదన్న చర్చ సాగింది. కార్యక్రమంలో తనిఖీ బృందం ఎస్‌ఆర్‌పీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులకు నిధులు మంజూరు

**ఎస్కేయూ, న్యూస్‌టుడే:** పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం గ్రాంట్ మంజూరు చేసింది. అనంతపురం జిల్లాలోని పాఠశాలలకు రూ.2.68 కోట్లు, సత్యసాయి జిల్లాకు రూ.2.27 కోట్లు మంజూరు చేసింది. దీంతో పాటు ఎమ్మార్సీ గ్రాంటు కూడా మంజూరు చేశారు. అనంత జిల్లాకు రూ.40.3 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ.41.6 లక్షలు మంజూరయ్యాయి.

# కబ్జా కోరల్లో ప్రభుత్వ స్థలం

## రూ.కోటికి పైగానే మార్కెట్ విలువ



తాటిచెట్లను కూల్చివేసి చదును చేసిన అక్రమార్కులు

**గుత్తి, న్యూస్‌టుడే :** గుత్తికి చెందిన ఇద్దరు నాయకులు రూ.కోటి విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. సర్వే నంబర్ 643లో సుమారు ఎకరన్నర ప్రభుత్వ స్థలం ఉండగా ఆ స్థలంపై మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు, మాజీ కౌన్సిలర్ భర్త కన్నువేశారు. పథకం ప్రకారం ఆ స్థలంలో ఉన్న తాటిచెట్ల కొట్టేశారు. తర్వాత స్థలాన్ని విక్రయానికి అనుకూలంగా చదును చేయించారు. ఇది లచ్చానిపల్లి జగనన్నకాలనీ సమీపంలోని కావడం గమనార్హం. సదరు నాయకులు పదేళ్ల నుంచి ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆక్రమించి ఇతరులకు విక్రయించి రూ.కోట్లు కూడగట్టుకోవడమే పనిగా పెట్టుకున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి వద్ద విలువైన స్థలాల దస్త్రాలు ఉన్నాయి. తద్వారా గుత్తిలో ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడున్నాయో గుర్తించి వాటిని కబ్జా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### అహుడా పరిధిలోనూ ఆక్రమణలే

జగనన్న కాలనీతోపాటు అహుడాకు చెందిన ఎంఐజీ కాలనీ ఉంది. అక్కడ సుమారు 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ప్రజల నివాస ప్రాంతం కావడంతో అక్కడ స్థలాలకు డిమాండు ఉంది. ఇప్పుడు తాటిచెట్లను తొలగిస్తూ ప్రభుత్వ స్థలాన్ని చదును చేస్తున్నారు. పొక్లెయిన్‌తో చెట్లను కూల్చివేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వీఆర్వో సురేంద్ర మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దారు ఓబులేశు దృష్టికి తీసుకువెళ్లారు. ఆక్రమణలను అడ్డుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడుతామని తహసీల్దారు తెలిపారు.

## శ్రీగంధం చెట్టు కొట్టి.. దుంగలు ఎత్తుకెళ్లి..



చెట్టు నరకడంతో మోడుగా ఇలా..

**రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే :** పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో జడ్జి నిసాస ప్రాంగణంలో ఉన్న శ్రీగంధం చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు నరికి దుంగను ఎత్తుకెళ్లారని యూపీఎస్ సీఐ జయనాయక్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఒక చెట్టును రంపంతో కోసి దుంగను ఎత్తుకెళ్లారన్నారు. మరొక చెట్టును కోసేందుకు ప్రయత్నం చేసి మధ్యలోనే ఆపి వెళ్లిపోయారన్నారు. విషయం తెలుసుకుని సీఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## చిరుతల సంచారంతో భయాందోళన

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే :** కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దేవాదులకొండ - ఒంటిమిద్ది గ్రామాల మధ్యలో ఉన్న కొండపై మూడు చిరుతలు మంగళవారం ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులకు కనిపించాయి. అవి అక్కడే తిరుగుతూ, అరుస్తున్నాయని వారు తెలిపారు. చిరుతలు ఎప్పుడు ఎటు వైపు నుంచి వచ్చి దాడి చేస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అటవి శాఖాధికారులు స్పందించి వాటిని బంధించి ఇతర ప్రాంతానికి తరలించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై అటవీశాఖ బీట్ అధికారి నాగేనాయక్‌ను వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారులకు తెలియజేశానన్నారు. జాగ్రత్తగా రైతులు, ప్రజలు ఉండేలా అవగాహన కల్పిస్తామన్నారు.

## ఉరుములు, మెరుపుల శబ్దానికి ఉపాధ్యాయుడి హఠాన్మరణం

**తాడిమర్రి, న్యూస్‌టుడే:** ఉరుములు, మెరుపుల శబ్దానికి కునుకుంట్ల గ్రామానికి చెందిన సాకే సూర్యనారాయణ(35) అనే యువకుడు హఠాన్మరణం చెందాడు. మంగళవారం మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. సూర్యనారాయణ బత్తలపల్లిలో ఉంటూ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆదివారం కడపకు వెళ్లి ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసి సోమవారం కునుకుంట్ల గ్రామానికి కుటుంబంతో సహా వచ్చారు. అదే రోజు రాత్రి గ్రామంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్న సమయంలో మూత్ర విసర్జనకు బయటకు వచ్చారు. వెంటనే ఇంట్లోకి వెళ్లి కిందపడిపోవడంతో భార్య గమనించి బంధువులకు సమాచారం ఇచ్చి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. భార్య ప్రస్తుతం 6 నెలల గర్భిణి కావడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి మరణంతో ముగ్గురు చిన్నారులు అనాథలుగా మారారు. ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.



సూర్యనారాయణ



అనాథలుగా మారిన చిన్నారులు

## పిడుగుపాటుకు జీవాల మృత్యువాత



మృతిచెందిన మేకలు

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** మండలంలోని పొడరాళ్లపల్లిలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. పిడుగు పాటుకు 32 మేకలు చనిపోయాయి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని గొర్రెల కాపరి రామ్మోహన్ వాపోయాడు. విషయం తెలుసుకున్న తెదేపా హిందూపురం సోషల్‌మీడియా కోఆర్డినేటర్ హేమలతాబాయి, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి మనోహర్, ఎంపీపీ ఆదినారాయణయాదవ్ పరిశీలించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో గొర్రెల కాపరికి ఫోన్లో మాట్లాడించారు. నష్టపరిహారానికి ప్రభుత్వం నుంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## తండ్రి హత్య కేసులో కుమారుడి అరెస్టు

**రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే :** రాయదుర్గంలోని సిద్ధేశ్వర కాలనీకి చెందిన నాయకుల బొమ్మన్న (51) హత్య కేసులో ప్రధాన నిందితుడు, ఆయన కుమారుడు నాగరాజును మంగళవారం అరెస్టు చేసినట్లు రాయదుర్గం యు.పి.ఎస్. సి.ఐ. జె.జయనాయక్ తెలిపారు. ఈ నెల 19వ తేదీన బొమ్మన్న సరిహద్దు కర్ణాటకలోని పెదారగుడ్డం గ్రామంలోని వ్యవసాయ తోటలో పనులు ముగించుకొని రాయదుర్గం వస్తుండగా తండ్రి, కుమారుడు ఘర్షణ పడ్డారు. నిందితుడు నాగరాజు భార్య ఆశ ప్రవర్తనపై తండ్రి బొమ్మన్న గొడవపడటంతో మాటా మాటా పెరిగింది. అతను ఆవేశంతో తన వెంట తెచ్చుకున్న కొడవలితో రెండు సార్లు తండ్రిని నరకడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి రోడ్డు ప్రమాదం జరిగినట్లు చిత్రీకరించి బంధువులకు తెలిపాడు. హత్య విషయం బయట పడటంతో అతను పరారీలో ఉన్నాడు. బొమ్మన్న భార్య శివమ్మ తన కుమారుడిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నాగరాజును అరెస్టు చేశారు. హత్య కేసును అనతి కాలంలోనే ఛేదించిన సి.ఐ.జయనాయక్, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

## భవన నిర్మాణ కార్మికుడి మృతి

**బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే :** బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో కొట్టాలపల్లికి చెందిన మల్లికార్జున (36) అనే వ్యక్తి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన రఫీతో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఈక్రమంలో ఇద్దరం మాట్లాడుకుందామని రాఘవేంద్ర కాలనీ దగ్గర కలిశారు. మల్లికార్జున, రఫీతో పాటు వారి వెంట వచ్చిన వారితో పరస్పరం గొడవపడి కొట్టుకున్నారు. కొద్దిసేపటి తర్వాత మల్లికార్జున ఒక్కసారిగా కిందపడి మృతిచెందాడు. బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు అనంతపురం వైద్యశాలలో మృతదేహాన్ని పరిశీలించారు. శవపరీక్షల నివేదిక వచ్చిన తర్వాత విషయం తెలుస్తుందని డీఎస్పీ తెలిపారు. ఈఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విద్యుదాఘాతంతో రైతు...

**గుమ్మఘట్ట, న్యూస్‌టుడే :** మండలంలోని కోనాపురంలో విద్యుత్తు తీగ తగిలి రైతు మారెన్న (55) మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. అతను స్తంభం ఎక్కి కర్రతో సర్వీసు తీగను తొలగిస్తుండగా ఒక తీగ అతనిపై పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని గుమ్మఘట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతనికి భార్య నీలమ్మ, కుమార్తె ఉన్నారు. స్థానిక ఎస్ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకుల దుర్మరణం



వినోద్



అశోక్

**కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులు మృతి చెందారు. కూడేరు మండలం శివరాంపేట వద్ద సోమవారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. వారిలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన వినోద్ (22), సింగంపల్లికి వాసి అశోక్ (21) అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందారు. ఇదే ప్రమాదంలో గాయపడిన కూడేరుకు చెందిన మరో యువకుడు దామోదర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలకు శవ పరీక్ష చేయించి, వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**నార్పల, న్యూస్‌టుడే:** నార్పల మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భానుప్రకాశ్‌రెడ్డి(19) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుల్తాన్‌పేటకు చెందిన రామచంద్రారెడ్డి కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి, స్నేహితులు ప్రణీత్, సతీష్‌తో కలిసి సాయంత్రం ద్విచక్రవాహనంలో నార్పలకు బయలుదేరారు. పెట్రోల్ బంక్ వద్దకు రాగానే వేగంగా వస్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొనడంతో భానుప్రకాష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ప్రణీత్, సతీష్ కూడా గాయపడటంతో స్థానికులు, పోలీసులు మెరుగైన వైద్య కోసం అనంతపురం వైద్యశాలకు తరలించారు. నార్పల ఎస్సై సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



భానుప్రకాశ్‌రెడ్డి

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

## ఆర్టీసీ సర్వీసులు పునరుద్ధరించాలి

**హిందూపురం:** హిందూపురం ఆర్టీసీ డిపోలో ఏకపక్షంగా రద్దు చేసిన బస్సులు తిరిగి పునరుద్ధరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వీరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రీజినల్ నాయకులు రాజారెడ్డిలు మాట్లాడుతూ బెంగళూరు సర్వీసులు, పావగడ, నంద్యాల, చెక్‌పోస్ట్, కడప, బళ్లారి, సర్వీసులు రద్దు చేయటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిపోలో ఉన్న అన్ని బస్సుల కండీషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్యారేజీలో కార్మికులకు సరైన టూల్స్ సరఫరా చేసి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. డ్యూటీ చార్టులు కొత్తగా వేసి అమలు చేయాలన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి

**రొళ్ల, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బీజీహళ్లి, హెచ్‌టీ హళ్లి, మల్లినమడుగు గ్రామాల్లో నిర్మిస్తున్న కల్వర్టులు, సీసీ రహదారుల పనులకు శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. అనంతరం మల్లినమడుగులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రొళ్ల మండలంలోని బీజీహళ్లి, మల్లినమడుగు పంచాయతీల్లో రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. టీఎన్‌టీయూ కార్యదర్శి గురుమూర్తి, కన్వీనర్ దాసిరెడ్డి, రాష్ట్ర కుంచటి వక్కలిగ సాధికార సమితి అధ్యక్షుడు పాండురంగప్ప, ప్రధాన కార్యదర్శి ఈరన్న, నాయకులు పాల్గొన్నారు.



గోరంట్ల మండలంలోని బూచేపల్లిలో వైద్యం అందక మంగళవారం రూ.30వేలు విలువచేసే ఆవు మృత్యువాత పడింది. పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల, సోమందేపల్లి, పరిగి మండలాల్లో పశువైద్యశాలలు, సిబ్బంది పరిస్థితి దారుణంగా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వంలో పశువైద్య రంగం పరిస్థితిలో మార్పురావాలని ప్రజలు కోరుతున్నారు.

# వైద్యం అందక మూగరోదన..

• భవనాలు శిథిలం, సిబ్బంది కొరత, సేవలు మృగ్యం

**గోరంట్ల, పరిగి, సోమందేపల్లి:** వ్యవసాయం తరువాత జిల్లాలో రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్న రంగం పాడిపరిశ్రమ. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల పెంపకంతో వేల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ఈ మూగజీవాలకు వైద్యం అందడం గగనమైంది. దశాబ్దాల కిందట నిర్మించిన పశువుల ఆసుపత్రి భవనాలు శిథిలావస్థకు చేరడం, వైద్యశాలల్లో సరిపడ సిబ్బంది లేకపోవడంతో ఈ సమస్య తీవ్రమైంది. అయిదేళ్ల పాలనలో కనీసం వాటిగురించి ఆలోచించని పాపాన వైకాపా ప్రభుత్వం పోలేదని ఆరోపణలున్నాయి. వైద్యం కోసం పశుపోషకులు నానాఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పశువులకు గాలికుంటు వ్యాధి, బొబ్బవ్యాధి సోకడంతో సకాలంలో చికిత్సలు అందివ్వలేక పోషకులు నానాతంటాలు పడుతున్నామని చెబుతున్నారు.

**పరిగి మండలంలో:** ఒక ఏరియా పశువైద్యశాల, వెటర్నరీ డిస్పెన్సరీలు మూడు ఉన్నాయి. ఇందులో మండల కేంద్రంలో పశువైద్యఆసుపత్రి నిర్మించి దశాబ్దాలు కావడంతో శిథిలావస్థకు చేరువలో ఉంది. పెచ్చులు ఊడిపడుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో అందులోనే కొనసాగిస్తున్నారు. శీగిపల్లిలో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. పరిగిలో కొత్తభవన నిర్మాణంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

**మండలాల వారీగా పశుసంపద**

| మండలం | పెద్ద పశువులు | గేదెలు | గొర్రెలు | మేకలు |
|---|---|---|---|---|
| గోరంట్ల | 22,887 | 692 | 84,725 | 11,272 |
| సోమందేపల్లి | 5,919 | 2,039 | 37,854 | 10,261 |
| పరిగి | 7,430 | 1,816 | 20,546 | 6,644 |

**ఎప్పటికప్పుడు సమస్యలను ఉన్నతాధికారులకు తెలిపాం**

మా పరిధిలో కొనసాగుతున్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. వానవోలులో భవన నిర్మాణ పరిస్థితి దారుణం. ప్రస్తుతం నిర్మాణం ఆగిపోయిన స్థలం ఎందుకు పనికిరాదు. కనీసం ఎనిమిది సెంట్ల స్థలం గుర్తించి కొత్త భవనం నిర్మించాల్సిన అవసరం ఉంది. అన్ని మండలాల్లో సిబ్బంది కొరత వాస్తవమే. అవసరమైన చోట భవన మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం.

**-శ్రీనివాసరావు, సోమనాథ్, సహాయసంచాలకుడు, గోరంట్ల, పరిగి**



గోరంట్ల: వానవోలు పాఠశాల ఆవరణలో చికిత్సలు

**గోరంట్ల మండలంలో:** 1.30 లక్షలకుపైగా పశు సంపద ఉండడంతో గోరంట్లలో సహాయ సంచాలకుల స్థాయి, వానవోలు, పాలసముద్రంలో డాక్టర్ స్థాయి, బూదిలిలో ఉపకేంద్రం ఏర్పాటుచేశారు. వానవోలు గ్రామంలో నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన ఆసుపత్రి శిథిలావస్థకు చేరడంతో అయిదేళ్ల క్రితం తొలగించారు. అనంతరం గోడల వరకు నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆవరణలో పశువులకు వైద్యం అందిస్తున్నారు. కాంపౌడర్ పోస్టు ఖాళీగా ఉంది. గోరంట్లలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్, మూడు అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడీ స్థాయి అధికారి ఉన్నా సిబ్బంది కొరతతో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించలేని పరిస్థితి కొనసాగుతోంది. బూదిలిలో జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ అధికారి ఉన్నప్పటికీ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో అటెండర్ పనిచేస్తున్నారు.

**సోమందేపల్లి మండలంలో :** మండలానికి ఒకేఆసుపత్రి ఉంది. ఇక్కడ భవనం శిథిలావస్థకు చేరువలో ఉంది. కాంపౌడర్ పోస్టుఖాళీగా ఉంది. మండలవ్యాప్తంగా సుమారు 70 వరకు పశుసంపద ఉంది.

## వాగుకు అడ్డంగా మట్టి.. పొలాల్లోకి నీరు

✦ 50 ఎకరాల్లో మొక్కజొన్న, వేరుసెనగ పంట జలమయం

**హిందూపురం, న్యూస్‌టుడే:** హిందూపురం గ్రామీణ మండలం కెంచపల్లి వద్ద కర్ణాటక ప్రాంతం మ్యాల్య చెరువు నుంచి వాగు ద్వారా వచ్చే నీరు కొటిపి చెరువుకు చేరాల్సి ఉంది. వాగుకు అడ్డంగా వైకాపా నాయకుడు మట్టివేయటంతో దాదాపు 50 ఎకరాల్లోకి సోమవారం రాత్రి నీరు చేరింది. దీంతో ఈ ప్రాంతంలో 20 నుంచి 30 మంది రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వేరుసెనగ పంటలు నీట మునిగాయి. గతంలో మ్యాల్య చెరువు నుంచి వస్తున్న నీరు ఈ వాగుద్వారా కొటిపి చెరువుకు వెళ్లేవని వాగుకు మట్టిని పెద్దఎత్తున వేయటంతో నీరు ముందుకు వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే గ్రామంలోకి నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగామారే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ డీఈ యోగానంద్ దృష్టికి తీసుకెళ్లటంతో పరిశీలించి తమ పరిధిలో ఉంటే చర్యలు తీసుకొంటామని, లేని పక్షంలో రెవెన్యూ అధికారులకు తెలియజేస్తామన్నారు.



కెంచనపల్లిలో మొక్కజొన్న పంటలోకి చేరిన నీరు

## నివాసాల్లోకి నీరు రాకుండా చర్యలు

**హిందూపురం పట్టణం,న్యూస్‌టుడే:** పట్టణంలోని కొట్నూరు చెరువుకు నీటిని తీసుకొచ్చే కట్ట కాలువకు అహమ్మద్‌నగర్ వద్ద గండి పడి నివాసాల్లోకి నీరు చేరుతుండటంతో మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సిబ్బంది కట్ట కాలువను పరిశీలించారు. కాలువలోకి మురుగు నీరు వెళ్లే చోట గండి పడినట్లు గుర్తించారు. చిన్న నీటి పారుదల శాఖ అధికారులను పిలిపించి, మరమ్మతులుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రూ.20 వేల ఖర్చుతో వెంటనే పూడ్చివేయవచ్చని గుర్తించి, మున్సిపాల్టీ తరఫున పనులు చేపట్టారు. ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలానుగుణ పంటలతోనే దిగుబడులు

**హిందూపురం గ్రామీణం :** మారుతున్న కాలానుగుణంగా పంటలను సాగుచేస్తే దిగుబడులు పెరుగుతాయని మండల వ్యవసాయాధికారి సురేంద్రనాయక్ సూచించారు. తూముకుంటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాఖాపరంగా తెలియజేసిన సలహాలు, సూచనలతో పాటు అధునాతన పద్ధతుల వైపు రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

**సమస్య:** నక్కలపల్లిలో శివారులో వీధి దీపాలు వెలగడంలేదు. **-గోవిందప్ప**
**సమాధానం:** రెండు రోజుల్లో వేయిస్తాం. **-ఆనందకుమార్, సర్పంచి**
**సమస్య:** హిందూపురం మున్సిపల్ పరిధిలోని బైపాస్‌రోడ్డులో ఏర్పడిన గుంతల్లో వర్షపునీరు చేరి ఇబ్బందిగా ఉంది. **-రామనారాయణ**
**సమాధానం:** మట్టిని వేయించి తాత్కాలిక మరమ్మతులు చేయించి వాహనాలు సజావుగా వెళ్లేలా చర్యలు చేపడతాం. **-సంగం శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్**
**సమస్య:** కదులపల్లయ్యపాళ్యంలో వీధి దీపాలు లేవు. **-నరసింహమూర్తి**
**సమాధానం:** ఏర్పాటు చేయిస్తాం. **-నరసమ్మ, సర్పంచి, జమ్మలబండ**
**సమస్య:** కేకేపాళ్యంలో పైపులైన్ పగిలి నీటి సమస్య ఉంది. **-తిప్పేస్వామి**
**సమాధానం:** పైపులు వేసి మరమ్మతు చేస్తాం. **-అమరేశ్, కార్యదర్శి, ముతుకూరు.**
-న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం, గుడిబండ,

స్పందనకు వందనం

**అమరాపురం, న్యూస్‌టుడే:** జనవనపల్లి శ్రీరామిరెడ్డి తాగునీటి కుళాయి నాలుగు నెలలుగా పని చేయని విషయంపై మంగళవారం చిత్ర వార్త ప్రచురితమైంది. వెంటనే స్పందిన శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం సూపర్‌వైజర్ నాగరాజు స్థానిక సిబ్బందితో మరమ్మతు చేయించి కుళాయిల ద్వారా నీటిని అందించారు. మండలంలోని వి.అగ్రహారం మారుతి కాలనీలో సర్పంచి రామన్న వీధి దీపాలు ఏర్పాటు చేశారు.



ప్రార్థనల్లో పాల్గొన్న తెదేపా నాయకుడు వెంకటేశ్వరరావు

## ఘనంగా గ్యార్మీ వేడుకలు

**పెనుకొండ, న్యూస్‌టుడే:** పట్టణంలోని బీటీఆర్‌కాలనీలోని జెండాకట్ట వద్ద మంగళవారం సీపీఐ అనుబంధ సంస్థ ఇన్సాఫ్‌కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో తెదేపా నాయకుడు వెంకటేశ్వరరావు, పార్టీశ్రేణులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెదేపా శ్రేణులకు ఫకీర్ల సాంప్రదాయ డప్పుమోతలతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది, ఇన్సాఫ్‌కమిటీ సభ్యులు, సీపీఐ నాయకలు, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే గ్రామసభల్లో 228 దరఖాస్తులు

**మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని వివిధ పంచాయతీల్లో నిర్వహించిన రీ భూ సర్వే గ్రామసభల్లో సమస్యలపై 228 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. ఇందులో బియ్యం కార్డుల కోసం 5, సీసీదారుల కోసం 14, హౌసింగ్ 85, పింఛన్ల కోసం 38, భూ సమస్యలపై 60, ఇతరత్రా 26 దరఖాస్తులు అందాయని తెలిపారు.

## ఆరోగ్యంపై అవగాహన సదస్సు

**ఆదేపల్లి(చిలమత్తూరు):** నిన్నటిరోజున పుట్టగొడుగులు తిని ఆదేపల్లి గ్రామానికి చెందిన వెంకటకృష్ణప్ప కుటుంబానికి చెందిన ఆరుగురు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.. డాక్టర్ తేజశ్విని ఆదేశాల మేరకు మంగళవారం గ్రామానికి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి చేరుకుని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరుగుతూ విషపూరితమైన పుట్టగొడుగులు తినడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై వివరించారు.

## నేడు సర్వసభ్య సమావేశం

**చిలమత్తూరు :** మూడునెలల్లో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి చిలమత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణమూర్తి తెలిపారు. ఉదయం 11గంటలకు అధికారులు తమ దగ్గర ఉన్న సమాచారంతో చేరుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు అందరూ హాజరు కావాలని కోరారు.

## చేపల పెంపకానికి వేలం

**అమరాపురం, న్యూస్‌టుడే:** మండలంలోని హేమావతి సచివాలయంలో మంగళవారం మూడు చెరువుల్లో చేపల పెంపకం కోసం మంగళవారం ఈవోఆర్డీ నాగముణి, సర్పంచి తిప్పేస్వామి సమక్షంలో వేలం పాట నిర్వహించారు. పొన్నన కట్ట చెరువుకు రూ.78 వేలకు తిప్పజ్జ దక్కించుకున్నాడు. పురవరం చెరువు రూ.2.37 లక్షలకు నింగరాజు దక్కించుకున్నాడు. హెంజేరు చెరువు రూ.2.5 లక్షలకు రామచంద్రప్ప దక్కించుకున్నాడు. దీంతో పంచాయితీ రూ.5.65 లక్షలు ఆదాయం సమకూరిందని వారు తెలిపారు.

## దంతవైద్యుడికి అబ్దుల్ కలాం అవార్డు

**గోరంట్ల:** గోరంట్ల మండలంలోని నార్శింపల్లికి చెందిన ప్రైవేటు దంతవైద్య నిపుణుడు లక్ష్మీపతిరెడ్డికి పశ్చిమబంగాకు చెందిన డబ్ల్యూఈఎల్‌ఆర్‌ఈడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం అవార్డు అందజేసినట్లు ఆయన తండ్రి రామలింగారెడ్డి తెలిపారు. ఫౌండేషన్ డైరెక్టర్ల చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## రైతు సమస్యలపై స్పందించండి

**గోరంట్ల:** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్యలు తీసుకోవాలని మండల సర్వసభ్య సమావేశంలో కొండాపురం ఎంపీటీసీ సభ్యురాలు సునంద అధికారులను కోరారు. సోమవారం కోరంలేక వాయిదా పడిన మండలమీట్ మంగళవారం ఉదయం ఎంపీపీ ప్రమీళ అధ్యక్షతన నిర్వహించారు. శాఖలవారీగా నామమాత్రంగా చర్చ కొనసాగించారు. ఎంపీడీవో నరేంద్రకుమార్, తహసీల్దార్ మారుతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పోలీసులంటే భయం పోవాలి

**గోరంట్ల, న్యూస్‌టుడే:** పోలీసులంటే ప్రజల్లో భయం పోవాలని, ఏదైనా జరిగినప్పుడు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సీఐ శేఖర్ సూచించారు. పోలీసుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్‌ఏపీఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీసు సేవలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్‌లో రిసెప్షన్ కౌంటర్, ఎఫ్‌ఐఆర్ ఎలా నమోదు చేస్తారు, జనరల్‌డైరీ, కేసుడైరీ, నిందితులను వేసే గదులు, వైర్‌లెస్ సెట్, రివాల్వర్ విద్యార్థులకు చూపించి అన్ని విషయాలను వివరించారు. పోలీసు శాఖలో అమ్మాయిలకు మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని బాగా చదువుకుని ఉద్యోగాలు సంపాదించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యనారాయణ, అధ్యాపకులు రమేష్, రామాంజనేయులు, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.





## వ్యాసరచనలతో విజ్ఞానం

హిందూపురంలోని నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'అంతర్జాలం వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8వ తరగతి చదవుతున్న జీకే భాను ప్రథమ, కె.అక్షయ ద్వితీయ, 9వ తరగతి చదువుతున్న ఎస్.రబియా తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ బహుమతులు అందజేశారు. **-న్యూస్‌టుడే, హిందూపురం**

# పేరుకు మున్సిపాలిటీ.. మట్టిరోడ్లే గతి

అభివృద్ధికి నోచుకోని ప్రశాంత్‌నగర్, టీచర్స్, హౌసింగ్ బోర్డు కాలనీలు

**మరమ్మతులు చేయిస్తాం**
**-సంగం శ్రీనివాసులు, పుర కమిషనర్**

కాలనీల్లో పరిశీలించి అసౌకర్యంగా ఉన్న మట్టిరోడ్లలో తాత్కాలిక మరమ్మతులు చేపడుతాం. నిధులు వస్తే వెంటనే సిమెంటు రహదారులు వేయడానికి చర్యలు తీసుకుంటాం.

**హిందూపురం అర్బన్:** హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని టీచర్స్‌కాలనీ, హౌసింగ్ బోర్డుకాలనీ, ప్రశాంత్‌నగర్‌లలో గతంలో ఏర్పాటుచేసిన సిమెంటు రోడ్లు మినహా ఐదేళ్ల వైకాపా పాలనలో కనీసం ఒక్క రోడ్డూ నిర్మించలేదు. ఇప్పటికీ మట్టిరోడ్లే శరణ్యం. వర్షాకాలంలో ఇవి బురదమయంగా మారడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కొత్తగా నిర్మించుకునే ఇళ్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నా పది ప్రాంతాల్లో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. ప్రజల నుంచి పన్నులు వసూళ్లు చేయడంతో శ్రద్ధచూపే మున్సిపల్ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో వచ్చిన నిధులతో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సిమెంటు రోడ్లు ఏర్పాటుచేశారే కాని తర్వాత రోడ్లు నిర్మించడంలో అలసత్వం చూపుతున్నారు. అటు అధికారులూ, ఇటు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులూ కాలనీల్లో సౌకర్యాలు కల్పించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రశాంత్‌నగర్‌లో మట్టిరోడ్డు ఇలా...

## తెదేపా సభ్యత్వ నమోదుపై శిక్షణ

**హిందూపురం, న్యూస్‌టుడే:** ఈనెల 26 నుంచి ప్రారంభభయ్యే తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై మంగళవారం స్థానిక ఆర్‌ఎంఎస్ ఫక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ నియోజకవర్గం శాసనసభ్యుడు బాలకృష్ణ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రతిగ్రామం, ప్రతి కుటుంబం సభ్యులు పార్టీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పట్టణ అధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్, గ్రామీణమండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల పార్టీ అధ్యక్షులు అశ్వర్థరెడ్డి, జయప్ప, రంగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



కోడూరు సమీపంలోని కుషావతి ప్రవాహం



డీఆర్ కొట్టాల వద్ద రోడ్డుపై..



మరువ పారుతున్న మునిమడుగు చెరువు



గుట్టూరు శివారులో 44వ జాతీయ రహదారిపై..



గోరంట్ల: వానవోలు సమీపంలో నేలవాలిన వరిపంట

# అర్ధరాత్రి అకాల వర్షం

✦ ఉప్పొంగిన నదులు.. నిండిన చెరువులు
✦ మునిగిన పంటలు.. తెగిన రహదారులు



పాయకట్ట వద్ద క్రస్ట్ గేట్ల నుంచి పరిగి చెరువులోకి జయమంగళి వరదనీరు

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో సోమవారం రాత్రి అకాల వర్షం కురిసింది. పెనుకొండ వద్ద జాతీయ రహదారిపై నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పదుల సంఖ్యలో చెరువులు నిండి మరవ పారాయి. పొలాలు నీట మునిగాయి. చాలా చోట్ల గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. కొన్ని పాత మిద్దెలు కూలిపోయాయి. మడకశిర నియోజకవర్గంలో చాలా చోట్ల కార్యాలయాలు కారుతున్నాయి. చిత్రావతి, జయమంగళి, కుషావతి నదులు ఉప్పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.

**-న్యూస్‌టుడే బృందం**



యర్రగుంటలో కూలిన ఇంటివద్ద బాధితుడు కొత్తింటి నరసింహప్ప



మడకశిర తహసీల్దార్ కార్యాలయం వద్ద..

# రహదారులపై బురద.. రాకపోకలకు అవస్థ

**సోమందేపల్లి, న్యూస్‌టుడే:** పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చాలకూరులో వీధులు, రహదారులు అపరిశుభ్రంగా మారాయి. దీంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ నడిబొడ్డున గతంలో సిమెంటు రోడ్డు నిర్మించినా ఎగువన మురుగు కాలువ పనులు చేపట్టకపోవడంతో వర్షాలకు మట్టి కొట్టుకొచ్చి ఇక్కడ పేరుకుపోయి బురదగా మారుతోంది. రాకపోకలకు అవకాశం లేకుండా పోతోంది. ఇక గ్రామంలోనే సుద్దకుంటపల్లి రహదారితో పాటు అంబేడ్కర్ నగర్, బీసీ కాలనీకి వెళ్లే రహదారిపైన ముఖ్యంగా ప్రధాన ర.భ రహదారి పక్కనే వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారడంతో పిల్లలు, మహిళలు, వృద్ధులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. అదుపు తప్పి జారి కింద పడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, ఇబ్బందులను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై సర్పంచి లలితమ్మ మాట్లాడుతూ గ్రామం నడిబొడ్డున గతంలోనే శుభ్రం చేయించడంతో చాలవరకు ఇబ్బందులు తొలగించామన్నారు. ఇతర చోట్ల నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడతామని ఆమె పేర్కొన్నారు.



సోమందేపల్లి: చాలకూరులో బురదతో ఇలా..



సుద్దకుంటపల్లికి వెళ్లే రహదారిపై ఇబ్బందులు పడుతున్న చిన్నారి

## పోలీసులతో మాజీ మంత్రి వాగ్వాదం

**గోరంట్ల, న్యూస్‌టుడే:** గోరంట్ల మండలంలోని గడ్డం తండాలో ఆదివారం రాత్రి జరిగిన పెళ్లి ఊరేగింపు సందర్భంగా ఘర్షణ జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయంపై చర్చించడానికి మాజీ మంత్రి ఉష స్థానిక ఎస్సై శ్రీనివాసులుకు ఫోన్‌చేసిన సందర్భంలో సరైన సమాధానం ఇవ్వకుండా అగౌరవంగా మాట్లాడారని మంగళవారం స్వయంగా పోలీసుస్టేషన్‌కు వచ్చి సీఐ శేఖర్, ఎస్సైలతో వాగ్వాదం చేశారు.

**క్రైం కార్నర్**

## గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య

**రొద్దం :** రొద్దం మండలం ఎల్‌జీబీ నగర్ సమీపంలోని అడుదాకులపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఈతవనం వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తిపై ఆగంతకులు పెట్రోలు పోసి తగలబెట్టారు. మృతదేహం గుర్తు పట్టలేనంతగా కాల్చివేసిన ఘటనపై వివాహేతర సంబంధాలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో పోలీసులు పలు గ్రామాల్లో విచారణ చేపట్టారు. మంగళవారం స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రొద్దం ఎస్సై నరేంద్ర, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హత్య చేసిన శవాన్ని పరిశీలించారు. పెనుకొండ డీఎస్పీ వెంటేశ్వర్లు, సీఐ రాఘవన్‌లు పరిశీలించి నిందితుల ఆచూకి కోసం సమీప గ్రామాల్లో ఆరా తీసినట్లు సమాచారం. అతని వద్ద పెయింటర్‌కు సంబంధించిన కూపన్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఎస్‌ఐ నరేంద్ర మాట్లాడుతూ హత్యకు గురైన వ్యక్తి ఎవరనేది తెలియరాలేదని చెప్పారు. అతడు ధరించిన దుస్తుల్లోని జేబులో ఉన్న పెయింటర్ కూపన్ల ఆధారంగా పెయింటర్‌గా పని చేస్తుండవచ్చని గుర్తించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## రైలు కిందపడి యువకుడి దుర్మరణం

**హిందూపురం, న్యూస్‌టుడే:** సోమవారం రాత్రి గుడ్డం రంగనాథస్వామి ఆలయ సమీపంలో గుర్తుతెలియని యువకుడు(28) రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ బాలాజీనాయక్ తెలిపారు. ఇతని కుడిచెయ్యిపై అమ్మ, ఆంగ్లంలో డార్లింగ్ అనే పచ్చబొట్లు ఉన్నాయన్నారు. ఎడమ చెయిపై నిర్మల్ అని కన్నడలో పచ్చబొట్టు ఉన్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఇతనికి సంబంధించిన వారు ఎవ్వరైనా 9440704699 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

## మూర్ఛతో చెరువులో పడి మృతి

**రొద్దం, న్యూస్‌టుడే :** మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామాంజనరెడ్డి (55) మూర్ఛవ్యాధితో చెరువులో పడి మృతిచెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రామాంజనరెడ్డి పాడి పశువులను మేతకు కోసం తోలుకెళ్లాడు. గ్రామ సమీపంలోనే చోళేమర్రి చెరువులో నీరు పుష్కలంగా ఉన్నాయి. గేదెలు అందులోకి వెళ్లడంతో వాటిని బయటకు తోలేందుకు వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తు మూర్ఛవ్యాధి రావడంతో నీటిలో పడిపోయి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడికి భార్య, ఒక కూమారుడు, కుమార్తెలు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఎంఈవోకు గాయాలు

**గోరంట్ల, న్యూస్‌టుడే:** గోరంట్ల మండల ఎంఈవో-2 గా పనిచేస్తున్న గోపాల్ మంగళవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో హిందూపురం వెళ్తుండగా మార్గమధ్యలో పాలసముద్రం సమీపంలో ఎదురుగా ట్రాక్టర్ రావడంతో ఎడమవైపునకు వెళ్లారు. వర్షాలు కురిసిన నేపథ్యంలో బురద ఉండడంతో అదుపుతప్పి కిందపడటంతో చిన్న రక్తగాయమైంది.

## ఒకరికి తీవ్ర గాయాలు

**గోరంట్ల :** బూదిలి సమీపంలో మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి జరిగిన ప్రమాదంలో చింతలపల్లి గ్రామానికి చెందిన తిప్పన్న తీవ్రంగా గాయపడ్డాడు. బూదిలివైపు నుంచి ఇంటికి వెళుతుండగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న చోట అదుపుతప్పి కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేసి 108 వాహనంలో హిందూపురం పంపించారు.

## అదృశ్యం కేసు ఛేదించిన పోలీసులు

**గోరంట్ల, న్యూస్‌టుడే:** మండలకేంద్రంలోని మోహన్‌రావు కాలనీకి చెందిన తల్లి జానకీ, కుమార్తెలు పల్లవి, గీతా కలిసి ఈనెల 19 నుంచి అదృశ్యమైనట్లు భర్త గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ శేఖర్ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని బృందాలను ఏర్పాటుచేసి దర్యాప్తు ప్రారంభించారు. చరవాణిలో అమ్మాయిలకు ఉన్న ఇన్‌స్టాగ్రాం ఖాతాల ద్వారా మంగళవారం కేసు ఛేదించినట్లు సీఐ తెలిపారు. ముగ్గురిని కడప - నెల్లూరు జిల్లాల సరిహద్దులో గుర్తించినట్లు వివరించారు.

# పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

## ఇళ్ల స్థలాలపై ఆర్డీవో విచారణ

**కొత్తచెరువు, న్యూస్‌టుడే:** కొత్తచెరువులో వైకాపా ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన 22 ఇళ్ల పట్టాలపై లబ్ధిదారులు గ్రీవెన్సులో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్డీవో సువర్ణ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. కొంతకాలంగా 22 పట్టాలపై స్థానికంగా ఇరువర్గాల మధ్య వివాదం నెలకొని పరస్పరం రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈస్థలాల్లో కొందరు చేపట్టిన నిర్మాణాలను కొందరు అడ్డుకోవడం సమస్యగా మారింది. పట్టాలివ్వలేదని ఒక వర్గం వాదిస్తుండగా.. ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సర్వే నంబరు 384 లేఅవుట్‌లోని పట్టాలపై ఆర్డీవో స్థానికంగా విచారించారు. జిల్లా కలెక్టరుకు నివేదిక ఇచ్చి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉప తహసీల్దార్ బాలాంజనేయులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## 'గోరంట్ల మాధవ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం'

**తాడిమర్రి, న్యూస్‌టుడే:** బాధ్యతాయుతమైన ఎంపీ పదవిలో ఉన్నప్పుడు నగ్న ప్రదర్శన చేసిన గోరంట్ల మాధవ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూషణ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైకాపా హయాంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడినందునే వల్లే రాష్ట్ర ప్రజలు 11 సీట్లతో సరిపెట్టారన్నారు. కూటమి నాయకుల గురించి ఆకాశం చెవాకులు పేలుతున్న గోరంట్ల మాధవ్ పెద్ద జోకర్ అని మండిపడ్డారు. ఇలాంటి మాటలు మళ్లీ మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.


కొత్తచెరువు: నీటి పల్లి మండలాల సరిహద్దులో వంగపేరు ప్రవాహ ఉద్ధృతి


అగ్రహారం చెరువు నుంచి ప్రవహిస్తున్న మరువ


ధర్మవరం చెరువు మొదటి మరువ ప్రవాహ ఉద్ధృతి


పుట్టపర్తి గ్రామీణం: పెడపల్లివద్ద వంతెనపై చిత్రావతినది

# దంచికొట్టిన వాన..

◆ పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, చెరువులు

◆ పలుచోట్ల స్తంభించిన రాకపోకలు

**న్యూస్‌టుడే బృందం:** శ్రీసత్యసాయి జిల్లా అంతటా అల్పపీడన వర్షం కుమ్మేసింది. కుంభవృష్టి వర్షంతో జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు వరదనీటితో పొంగి పొర్లుతున్నాయి. నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు పలుచోట్ల స్తంభించాయి. వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు నేలకు ఒరిగాయి. రహదారులు, వంతెనలు దెబ్బతిన్నాయి. పుట్టపర్తి వద్ద చిత్రావతినది, కొత్తచెరువు వద్ద వంగపేరు, దాదులూరు వాగు, బత్తలపల్లి మండలం పోట్లమర్రి వంక ప్రవాహంతో పుట్టపర్తి, ధర్మవరం, ధర్మవరం నుంచి బత్తలపల్లికి రాకపోకలు స్తంభించి పోయాయి. వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా పలు చెరువులు పొంగిపొర్లుతుంటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### 850 హెక్టార్లలో పంటలకు నష్టం

శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ, ఉద్యాన పంటలు దాదాపు 85 హెక్టార్లలో నష్టం జరిగింది. వ్యవసాయశాఖ 747 హెక్టార్లు, ఉద్యానశాఖ పంటలు 46.47 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. వేరుసెనగ 346, వరి 207, సజ్జలు 63, లకంది 14, కొర్ర 7, సామ2, పత్తి 16 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. అరటి, ద్రాక్ష, టమాట, మిరప, వంకాయ పంటలు 46.47 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్ తెలిపారు. పంట నష్టాన్ని పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి, ప్రభుత్వానికి పంపుతామని వివరించారు.

### దెబ్బతిన్న రహదారులు


మామిళ్లపల్లి వద్ద బోల్తాపడిన వాహనం

జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు రహదారులు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఓడీసీ మండలం సున్నంపల్లి వద్ద బ్రిడ్జి, రహదారి, కసుగసపల్లి మండలం దాదులూరు వద్ద రహదారి, సీకేపల్లి మండలం వెల్దుర్తి, చెన్నంపల్లి రహదారి దెబ్బతిన్నాయని పంచాయతీరాజ్ ఈఈ మురలి తెలిపారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

● కియా అనుబంధ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు కొట్లపల్లివద్ద కిరణ్‌కుమార్‌రెడ్డి, వీరేష్, రాఘవేంద్ర వంగ పేరు దాటుతుండగా వాహనాలతో సహా కొట్టుకుపో యారు. చెట్ల కొమ్మల సాయంతో ఒడ్డుకు చేరుకోగా వాహనాల ఆచూకీ లభ్యం కాలేదు. ధర్మవరం చెరువు నిండి మరువ ప్రవహిస్తోంది. మొదటి మరువ వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో చెరువుకట్ట కింద మార్గంలో వెళ్లే 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తెదేపా ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి వేర్వేరుగా గ్రామాల్లో పర్యటించారు. రైతులకు ధైర్యం చెప్పారు.


కర్ణాటకకు వెళ్లే దారిలో అమడగూరు పెచెర్వు నీటి ప్రవాహం


ఓబులదేవరచెరువు: తెగిపోయిన సున్నంపల్లి వంతెన


ధర్మవరం పట్టణం: నడిమిగడ్డపల్లిలో నేలకొరిగిన ద్రాక్షతోట


రామగిరి మండలం పోలేపల్లిలో వేరుసెనగ కొట్టుకుపోవడంతో ఎమ్మెల్యే పరిటాల సునీతకు గోడు వెళ్లబోసుకుంటున్న మహిళ రైతు


ధర్మవరం మండలం ఓబుళనాయునిపల్లిలో విరిగిన స్తంభాన్ని పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

## నూతన కార్యవర్గం ఏర్పాటు

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** ముదిగుబ్బలో బలిజ సంరక్షణ సమితి పేరుతో నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అశోక్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ నరేష్, సెక్రెటరీగా నారాయణస్వామి, గౌరవాధ్యక్షుడిగా దేగల వెంకట్, ఉపాధ్యక్షుడిగా కరుణాకర్, గౌరవ సలహాదారుగా బొగ్గు రాజశేఖర్, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## మధ్యాహ్న భోజనం భేష్

**ధర్మవరం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు 11 ఏళ్లుగా మధ్యాహ్న భోజనం దాతల సహకారంతో అందిస్తుండటం అభినందనీయమని జిల్లా డీవీఈవో రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలను పరిశీలించారు. విద్యార్థినులకు భోజనం వడ్డించారు. విద్యతో పాటు నాణ్యమైన భోజనం కళాశాలలో అందుతోందని, విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బండి వేణుగోపాల్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

**తనకల్లు, న్యూస్‌టుడే:** కదిరి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా కొక్కంటిక్రాస్‌కు చెందిన ఆదిశేషారెడ్డి ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అమానుల్లా, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి కార్తీక్‌లు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఆదిశేషారెడ్డి తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు.

## మెకానిక్ ఆత్మహత్యాయత్నం

**ధర్మవరం, న్యూస్‌టుడే:** పట్టణంలోని గాంధీ నగర్ శ్మశానవాటిక వద్ద మంగళవారం ఫకృద్దీన్ అనే యువకుడు అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బైక్ మెకానిక్ అయిన ఫకృద్దీన్ అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేశాడని 1వ పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

## భర్త వేధింపులపై ఫిర్యాదు

**నంబులపూలకుంట(గాండ్ల పెంట):** ఎన్పీ కుంట మండలం గురికనిపల్లికి చెందిన శారదకు అన్నమయ్య జిల్లా గుట్టమీదపల్లి నందలూరు గ్రామానికి చెందిన నాగరాజుతో వివాహం అయింది. భర్త, అత్త మామలు వేధిస్తున్నారని శారద ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వలిబాషా తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారించి నాగరాజు, వెంకటమ్మ, మల్లికార్జున, సుబ్బరత్నమ్మలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

# ప్రమాదం.. రుణభారం.. బతుకు ఛిద్రం

### మంచానికే పరిమితం

### ప్రభుత్వ సాయానికి ఎదురుచూపులు

### భర్త, పెద్దకొడుకు మృతితో దయనీయం

**కదిరి, తలుపుల, కొత్తచెరువు, న్యూస్‌టుడే:** ప్రమాదం, రుణభారం ఆ కుటుంబాలకు శాపంగా మారాయి. తలుపుల మండలం ఉబ్బరవాండ్లపల్లిలో వ్యవసాయం పెట్టుబడుల రుణభారంతో నాలుగేళ్ల కిందట తండ్రి ఆత్మహత్యకు పాల్పడగా ఇటీవల కొడుకు బలవన్మరణం చెందాడు. కొత్తచెరువు మండలం కనిశెట్టిపల్లిలో వినాయక చవితి పండగ సంబరాలకు ముస్తాబుకు కొబ్బరికాయలు ఎక్కి ప్రమాదానికి గురై మంచానపడ్డాడు. ఆ కుటుంబాల కష్టాలు గట్టెక్కేలా రుణభారం తీరేలా, ఆరోగ్యం కుదుటపడేలా వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం ఆదుకోవాలని ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.


మంచానికే పరిమితమైన చంద్రమోహన్

కొత్తచెరువు మండలం కనిశెట్టిపల్లికి చెందిన చంద్రమోహన్‌ది సామాన్య కుటుంబం. కుటుంబ సభ్యుల సహకారం కొరవడటంతో తమ్ముడు నరసింహ డితో కలిసి జీవనం సాగిస్తున్నారు. వీరి తండ్రి రామచంద్ర భాగా బతికి వృత్తి, చంద్రమోహన్ ఏ ఒకటిగా ఎకరం పొలం, మట్టి మిద్దె మాత్రమే ఉన్నాయి. పొలం వర్షాధారం కావటంతో పండని పరిస్థితి. దీంతో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వినాయక చవితి పండగకు ఆలయ ముస్తాబుకు కొబ్బరి మట్టల కోసం చెట్టెక్కాడు. పైకి ఎక్కాక మట్ట విరిగి పట్టుతప్పడంతో నేలపై పడి వెన్నెముక దెబ్బతిని మంచం పట్టాడు. వైద్యఖర్చులకు స్తోమత లేక ఆసుపత్రికి వెళ్లడమే మానేశారు. మంచం నుంచి కదిలించాలన్నా ఇద్దరు వ్యక్తుల సాయం అవసరం. దీంతో తమ్ముడు నరసింహులు ఆధారంగా కాలం గడుస్తోంది. దాతలు ఆర్థిక చేయూతతో శస్త్రచికిత్సతో మళ్లీ జీవితం సాధారణంగా గడిపేలా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


భర్త, పెద్ద కొడుకును పోగొట్టుకున్న సాయిలీల చిన్నకొడుకుతో..

తలుపుల మండలం ఉబ్బరవాండ్లపల్లికి చెందిన రవికుమార్ కుటుంబానికి వ్యవసాయమే జీవనాధారం. భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. బిడ్డలను బాగా చదివించాలన్న ఆశతో స్తోమత లేకున్నా పెట్టుబడుల అప్పులు చేసి సాగు చేసేవాడు. దిగుబడులు అందక, గిట్టుబాటు లభించక రుణం పెరగడంతో తీర్చలేనని భయంతో నాలుగేళ్ల కిందట పొలంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య సాయిలీల, బిడ్డలు ఉన్నదాని చిన్నపాటి రేకులషెడ్డులో జీవనం సాగిస్తున్నారు. పెద్దకొడుకు గురుప్రసాద్ కదిరిలో ఇంటర్, చిన్నకొడుకు పండు ఓడీచెరువులో బంధువుల ఇంట్లో ఉండి తొమ్మిదో తరగతి చదువుతున్నారు. భర్త మృతితో రుణభారం మరింత పెరిగి రూ.5 లక్షలకు చేరింది. అప్పుల బాధ, కుటుంబ జీవన పరిస్థితులకు మనస్తాపం చెందిన పెద్దకొడుకు ఆరు రోజుల కిందట ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. అండగా ఉండాల్సిన భర్త, చేతికొచ్చిన కొడుకును పోగొట్టుకున్న సాయిలీల, చిన్నకొడుకు భవిష్యత్తు, తీర్చాల్సిన రుణం భారంగా మారాయి. ప్రభుత్వం ఆర్థిక సాయంతో ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222



**సమస్య:** కదిరి మండలం చలమకుంట్లపల్లి ప్రధాన రహదారిలో మురుగు, వర్షపు నీరు నిల్వ చేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- శ్రీనివాసులు, పందలకుంట**

**సమస్య:** కుమ్మరవాండ్లపల్లి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో విద్యుత్తు స్తంభం శిథిలావస్థకు చేరుకుంది. కొత్తది ఏర్పాటు చేసి దాదాపు 6 నెలలు కావస్తున్నా ఇప్పటికీ సరఫరాకు వినియోగించకపోవడంతో నిరుపయోగంగా ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- ఈశ్వరయ్య**

**సమాధానం:** చలమకుంట్లపల్లి ప్రధాన రహదారిలో నిలుస్తున్న నీటిని తొలగించి, నిల్వ చేరకుండా చర్యలు తీసుకుంటాం. కుమ్మరవాండ్లపల్లి ఎస్సీ కాలనీలోని శిథిల విద్యుత్తు స్తంభం తొలగించి కొత్తదానికి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

**(పై ప్రశ్నలకు చలమకుంట్లపల్లి, కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ కార్యదర్శులు సంయుక్త, శివశంకర్‌లు సమాధానాలు ఇచ్చారు.)**

– న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

## ఎమ్మెల్యే హామీల అమలు

**కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే:** కదిరి మండలం పట్నం గ్రామంలో ఈనెల 20వ తేదీ పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తెచ్చిన సమస్యలను ఎంపీడీవో పోలప్ప ఆధ్వర్యంలో అధికారులు పరిష్కరించారు. గ్రామంలో ఇద్దరు వృద్ధులకు వేలిముద్రల సమస్య కారణంగా చౌక బియ్యం రాకపోవడంతో సచివాలయ సిబ్బందితో సమస్యను పరిష్కరించి బియ్యం అందజేశారు. 100 శాతం దివ్యాంగుడైన చిన్నారికి రూ.15 వేలు పింఛన్ కోసం డీఎంహెచ్‌వోతో మాట్లాడి అందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. ప్రయివేటు భవనంలో నిర్వహిస్తున్న బీసీ వసతి గృహాన్ని అదనపు గదులు ఉన్న ప్రాథమిక పాఠశాలకు తరలించారు. చెరువు మరువ సమయంలో పొలం పనులకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతుండటంతో రూ.1 లక్ష పంచాయతీ నిధులతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమాల్లో సచివాలయ సిబ్బందితోపాటు, తెదేపా నాయకులు కుప్పాల ప్రసాద్, చంద్రశేఖర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సినీ నటుడు నాగార్జునకు స్వాగతం

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** సినీ నటుడు నాగార్జునకు సత్యసాయి విమానాశ్రయంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఉదయం 10 గంటలకు ప్రత్యేక విమానంలో పుట్టపర్తి చేరుకున్నారు. విమానాశ్రయంలో నాగార్జునకు జిల్లా అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పుష్పగుచ్ఛం ఇచ్చి మెమెంటోను అందజేశారు. మీలో ఎవరు కోటీశ్వరుడు కార్యక్రమంలో అదనపు ఎస్పీ రూ.12.50 లక్షలు గెలుచుకున్న విషయాన్ని ఇద్దరూ గుర్తు చేసుకున్నారు. తర్వాత రోడ్డు మార్గం ద్వారా అనంతపురంలో జరిగే ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. దాదులూరు వద్ద ప్రవహిస్తున్న నీటి ఉద్ధృతి, ట్రాఫిక్ అంతరాయం వల్ల నాగార్జున గంటపాటు వాహనంలోనే ఉన్నారు. మధ్యాహ్నం 2.40 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.


నాగార్జునకు జ్ఞాపికను అందజేస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాసులు

## రజకులకు రాయితీ రుణాలివ్వాలని వినతి

**ధర్మవరం, న్యూస్‌టుడే:** రజకులకు బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం రాయితీతో రుణాలు ఇవ్వాలని, కమ్యూనిటీ హాలు నిర్మించాలని రజక వృత్తిదారుల సమాఖ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్దలాపురం నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం రజకులతో కలసి ఆర్డీవో కార్యాలయ ఏవో ఖతిజన్‌ఖుబ్రాకు వినతిపత్రం అందజేశారు. రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాము, పోతలయ్య, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

## పేద రైతులకు సాగుభూమి పంపిణీకి కృషి

**పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే:** అర్హులైన పేదరైతులకు సాగు భూమి వచ్చేలా కృషి చేస్తామని వ్యవసాయ మహిళా కార్మిక సంఘం జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మామిళ్లకుంట గ్రామంలో తొమ్మిది మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రమాదేవి, కో కన్వీనర్‌గా అరుణమ్మ, ఇతర కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. వ్యవసాయ, ఉపాధి కూలీల సంక్షేమానికి కృషి చేస్తామని, సాగుభూమితోపాటు ఇళ్ల స్థలాలు దక్కేలా పోరాటం చేస్తామని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.


వ్యవసాయ మహిళా కార్మిక సంఘం నూతన కార్యవర్గం

## జూడోలో బంగారు పతకాలు

**ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని చిగిచెర్ల ఉన్నత పాఠశాలకు చెందిన నందిని, లాస్యరెడ్డి, యశస్విని రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో బంగారు పతకాలు సాధించారని ఆ పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. అండర్-17 విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు శ్రీకాళహస్తిలో రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరిగాయి. నందిని 36, లాస్యరెడ్డి 44, యశస్విని 52 కేజీల విభాగంలో తలపడి విజేతలుగా నిలిచి బంగారు పతకాలు సాధించారని పీడీ తెలిపారు. ఈ పోటీలకు సహాయకులుగా ప్రతాప్‌నాయుడు, రెడ్డప్ప, నాగార్జున వ్యవహరించారు.



బంగారు పతకాలతో నందిని, లాస్యరెడ్డి, యశస్విని

## ఆర్ఐకు ఆత్మీయ వీడ్కోలు

**పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే:** విధినిర్వహణలో ఉత్తమసేవలు అందించి బదిలీపై వెళ్తున్న ఆర్ఐ చంంద్రశేఖర్‌కు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, సతీష్, ఆర్ఐ వలి, ఎస్బీ ఎస్సై ప్రదీప్ సింగ్, ఏఆర్ ఎస్సై శ్రీరాములు, షౌకత్ అలీ, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

### హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత

కొత్తచెరువు మండలం ఎర్రవల్లికి చెందిన హోంగార్డు చెన్నప్ప ఈ సంవత్సరం జులై 15న అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబానికి జిల్లాలోని హోంగార్డులు ఒకరోజు వేతనం అందించారు. మంగళవారం రూ.4,35,000 జిల్లా పోలీసు కార్యాలయంలో చెన్నప్ప భార్య చంద్రకళకు ఎస్పీ చేతులమీదుగా చెక్కు అందజేశారు.


బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ రత్న







## ప్రతిభా పరీక్షలతో విజ్ఞానం

**ధర్మవరం, న్యూస్‌టుడే:** విద్యార్థులు పోటీతత్వం అలవరచుకొని సృజనాత్మకతకు పదును పెట్టాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ సూచించారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు - విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు జి.పవన్‌కుమార్, వై.అశోక్ బాబు, పి.సంతోష్‌కుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఉపాధ్యాయులు వేణుగోపాల్, లలితమ్మ పాల్గొన్నారు.

## సామర్థ్యాల మదింపునకు సరైన వేదిక

**కదిరి, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లో సామర్థ్యాలను మదింపునకు పోటీలు సరైన వేదికగా ఉపయోగపడతాయని సాధన పాఠశాల కరస్పాండెంట్ సాధిక్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని సాధన ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు - విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థుల్లో పదో తరగతి ఎస్.తబ్సుమ్ ప్రథమ, తొమ్మిదో తరగతి ఎస్.అద్నాన్ ద్వితీయ, ఎనిమిదో తరగతి ఎ.యశ్వంత్ తృతీయ స్థానాలు సాధించారు. వీరికి కరస్పాండెంట్ సాధిక్‌బాషా చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌలాలి, కల్పలత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





## విధుల్లో అలసత్వంపై పట్నం వైద్యులకు తాఖీదులు

**కదిరి గ్రామీణం:** కదిరి మండలం పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులుగా విధులు నిర్వహిస్తున్న ప్రమీల, వినోద్‌ల పనితీరుపై డీఎంహెచ్‌వో డాక్టర్ మంజువాణి మంగళవారం పుట్టపర్తి డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ చేశారు. ఈనెల 20న పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల పనితీరుపై స్థానికులు ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే డీఎంహెచ్‌వోతో మాట్లాడారు. చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మంజువాణి విచారణ అధికారిగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్‌ను నియమించగా ఆయన ఆధ్వర్యంలో వైద్యులను విచారణ చేసి తాఖీదులు జారీ చేశారు.

## విద్యుత్తు స్తంభానికి తీగల తొలగింపు

**కదిరి, న్యూస్‌టుడే:** పట్టణంలోని సైదాపురం వాటర్‌ట్యాంకు సమీపంలోని విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న తీగలను మంగళవారం విద్యుత్తుశాఖ సిబ్బంది తొలగించారు. 'నిలువెత్తు నిర్లక్ష్యం' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో చిత్ర వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఏఈ చెన్నకృష్ణ స్తంభానికి అల్లుకున్న తీగల తొలగింపు చర్యలు చేపట్టారు. విద్యుత్తు సిబ్బంది స్తంభంపైకి పాకిన తీగలు, చుట్టూ ముళ్లపొదలను తొలగించారు. దీంతో స్థానికుల్లో ప్రమాద భయం తీరింది.